# ప్రమోషన్స్

మన పురాణేతిహాసాల్ని, ఫిలాసఫీని ఎటుపడితే అటు అర్థం చెప్పుకోవచ్చు. ఎవరికి అనుకూలంగా వారు భాష్యం చెప్పుకోవచ్చు. ఎవరికి అనుగుణ్యంగా వారు అర్థం చెప్పుకోవచ్చు.

అయోధ్యారాముడు తన తండ్రిమాట విని అడవులకు వెళ్లబట్టికదా అనేకులైన రాక్షసుల్ని సంహరించి ధర్మసంస్థాపన చేసాడు?

"నేను పెద్ద కొడుకుని! నాకే రాజ్యాధికారం వుంది. నేనెందుకు అడవులకువెళ్లాలి?" అని తండ్రిని ధిక్కరిస్తే ఇంతమంది రాక్షసుల్ని సంహరించడం జరిగేదా?

అంచేత మనం రాముడినే కదా ఆదర్శంగా తీసుకోవాలి?

కానీ, ఇక్కడే వుంది లిటిగేషను!

విష్ణుభక్తుడైన ప్రహ్లాదుణ్ని దృష్టాంతంగా తీసుకున్నాం అనుకోండి. అతను తండ్రిమాటను ధిక్కరించాడు. "అబ్బాయీ! విష్ణువు అనేవాడు మనకి శత్రువు. అతణ్ణి నువ్వు దేవునిగా భావించి స్తుతించడం తగదు!" అని తండ్రి చెబితే ప్రహ్లాదుడు ఎందుకు ఖాతరు చేయలేదు?

ఇక్కడ మనం ప్రహ్లాదుణ్ణి ఆదర్శంగా ఎందుకు తీసుకోకూడదు?

'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ' అనేది ఆర్యోక్తి. తల్లికి రాజ్యాధికారం లేదుగనుక, రాజైన పితృదేవుడు, తరువాత ఆచార్యుడు, ప్రహ్లాదునికి నచ్చ జెప్పారు. వాళ్లిద్దర్నీ ప్రహ్లాదుడు పోపొమ్మన్నాడు.

ఇక్కడ మనం ప్రహ్లాదుణ్ని ఆదర్శంగా ఎందుకు తీసుకోకూడదు? ఈ రాముడూ ప్రహ్లాదుడూ పురాణేతిహాసాల్లోని పాత్రలే!

తన తండ్రి అపమార్గంలో వున్నాడని భావించాడు ప్రహ్లాదుడు. అందుకే అతడు తండ్రిని ధిక్కరించాడు!

నేను రాముణ్ని ఆదర్శంగా తీసుకోకుండా ప్రహ్లాదుణ్ని ఆదర్శంగా తీసుకుని

చిక్కుల్లో చిక్కుకున్నాను.

"అబ్బాయీ! నువ్వు మైనర్‌వి. నీకు డ్రైవింగ్ వచ్చినా లైసెన్స్ లేదు. స్కూటర్ తీసుకెళ్లకు. చిక్కుల్లో పడతావ్" అని మా నాన్నగారు ఎంత చెప్పినా ప్రహ్లాదునిలా ధిక్కరించేసాను.

నాతోపాటు మరో నలుగుర్ని గంటస్తంభం దగ్గరే పట్టేశారు. మా స్కూటర్లు లాక్కున్నారు. మమ్మల్ని ఒకటవ పోలీసు ఠాణాకి తీసుకెళ్లారు. పేర్లు రాసుకున్నారు. మర్నాడు కోర్టుకి హాజరుకమ్మన్నారు.

మమ్మల్ని బుక్ చేసిన హెడ్‌గారు సి.ఐ. గారి సమక్షంలో మమ్మల్ని నిలబెట్టారు.

సి.ఐ. గారు మా ఐదుగురి మొహాల్ని నిశితంగా పరిశీలించారు.

"మిమ్మల్ని ఫస్ట్ వార్నింగ్ కింద విడిచి పెట్టేస్తున్నాను. మళ్లీ ఎప్పుడేనా లైసెన్సు లేకుండా డ్రైవ్ చేశారా జాగ్రత్త!" అని గర్జించారు.

హెడ్‌గారు మా స్కూటర్ తాళాలు మాకిచ్చేశారు.

బతుకు జీవుడా అని బైటపడ్డాం.

.... ....

"అదేట్సార్! ఈ మధ్య మనకి బొత్తిగా బుకింగ్స్ లేవని మీదనుంచి గూటాయింపులు మీద గూటాయింపు లొచ్చేస్తుంటే ఆ ఐదుగుర్నీ ఒగ్గేసేరేటండీ?" అన్నాడు హెడ్డు.

"ఏం చెయ్యమంటావు? అందులో ఒకడు ఎస్పీ దొరగారబ్బాయి. అతన్ని బుక్ చేసేశామంటే మనకి వచ్చేవి ప్రొమోషన్స్‌కావు, మోషన్సు!" అన్నారు సి.ఐ. దొరగారు.

5-10-1991 శనివారం
ఆంధ్రభూమి దినపత్రిక